# 6. పరమ సత్యం

సీతాపతి రావు పదవి పోగొట్టుకోవడం గురించి, అందరికంటే ఎక్కువ బాధపడింది చంద్రలేఖే. అసలు బాధ పదవీ, పరువూ పోయాయని కాదు, దీని వల్ల పెద్ద కూతురు భవిష్యత్తు ఏమవుతుందో అనే ఆరాటం. తాండవకృష్ణ కుటుంబంలో వియ్యం అభిలషణీయం కాదని, ఎన్నోసార్లు నచ్చచెప్పడానికి ఆమె ప్రయత్నించింది కానీ అదంతా అతను పెడచెవిని పెట్టాడు కదా! భార్గవ రాముడు కూడా చాలాసార్లు మురళి దుష్ప్రవర్తన గురించి తండ్రికి తెలియచెప్తూనే వచ్చాడు. కానీ, అవన్నీ సముద్ర తీరస్థశిలల్ని తాకిన తరంగాల్లా భంగమవుతూనే వచ్చాయి. సీతాపతిరావు గడ్డు రోజులు ప్రారంభమయ్యాక, తాండవకృష్ణ, అతని కొడుకు ఏరకంగా తమకు ఎడమై పోయారో అని తెలుసుకున్న భార్గవరాముడు రెండు మూడు సార్లు కొన్ని పథకాలు తన తండ్రిగారి పరిగణనకు తీసుకురావడం జరిగింది.

"డాడీ! ముహూర్తం ఐతే నిశ్చయించాము కానీ, ఏదో సాకుచెప్పి, వాళ్ళ మాట తప్పుతారేమోనని నీకు భయంగా ఉంది. లేకపోతే వాళ్ళు ఇలా మొఖం చాటుచేసుకుని తిరిగే వాదు కాదు కదా. అందుకనే నేను ఏమనుకుంటున్నానంటే, అతన్ని తీసుకువచ్చి, ప్రస్తుతానికి రిజిస్టర్ వివాహం జరిపించి తరువాత ముహూర్తం నాటికి శాస్త్రోక్తంగా పెళ్ళి చేద్దాం."

"అలా పట్టుకురావడానికి అతను ఏమైనా కుక్క పిల్లా... పిల్లి పిల్లా? నువ్వు ఒక రౌడీవయితే అతను మహారౌడీ. నీ చేతికింద ఒక గాంగ్ ఉంటే అతని కింద గూండాలున్నారు. ఒక విషయం గుర్తుంచుకో! నేను ఈ రోజు ఒక శవతుల్యుడైన మనిషిని మనకి ఎవరి దన్నూ లేదిప్పుడు. తాండవకృష్ణకి మంచి పలుకుబడి ఉంది పోలీసులు కూడా అతని జేబులో ఉన్నారు."

"అవన్నీ నాకు తెలుసు డాడీ. ఈ విషయం నాకు వదిలేయండి. నేను చేసి చూపిస్తా."

"సరే, బలప్రయోగంతో నువ్వలా చేశావే అనుకో తరువాత తన బతుకంతా మురళితో గడపవలసింది నీ చెల్లాయి. అదలా ఉంచితే తాండవకృష్ణ ఈ రాష్ట్రంలోనే అతి పెద్ద క్రిమినల్ లాయర్. అనుకున్నదల్లా సాధించే సామర్థ్యం అతనికి ఉంది. అందుకే బాబూ ఈ దూకుడు వద్దు. ఓపిగ్గా వేచి ఉందాము. నేను జీవితంలో ఎన్నో తప్పులు చేశాను. అందుకే దేవుడు నాకీ శిక్ష విధించాడు. కానీ, మన ఇందూ పాపం అమాయకురాలు. ఏ పాపమూ ఎరుగని ఆమెను దేవుడు కాపాడతాడు."

మరోసారి మురళీకృష్ణని తీసుకువచ్చి ఒక అగ్రిమెంట్ రాయిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది భార్గవరాముడికి. దానికి కూడా సీతాపతిరావు అంగీకరించలేదు.

రోజులు ముందుకు పరిగెత్తుతుంటే, భార్గవరాముడి దిగులు కూడా పెరగసాగింది. సీతాపతిరావు తాండవకృష్ణతో చాలాసార్లు మాట్లాడాడు కానీ, ఆ వకీలు అటూ ఇటూ తేలకుండా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకునేవాడు. ఈ విధంగా అసహ్యమైన అనిశ్చితావస్థతో కూడిన ఆందోళనలో ఆ కుటుంబం మునిగి ఉన్నప్పుడు ఒకరోజు ఉదయం, ఇందులేఖ మురళి ఇంటికి వెళ్ళడం, అదే రోజు సంధ్యావేళల్లో ఆ జటిల సమస్యలకు ఆమె ఒక అంతిమ పరిష్కారం కనుక్కోవటం జరిగింది.

రాత్రి ఎనిమిది దాటాకా కూడా ఇందూ కిందకి రాకపోవడంతో ఆమెను పిలవడానికి చంద్రలేఖ చంద్రికను పంపించింది. ఆమె వెళ్ళి తలుపు తట్టి పిలిచినపుడు జవాబేమీ రాకపోవడంతో కిందకి వెళ్ళి, "మమ్మీ! అక్క స్నానం

చేస్తున్నట్టుంది" అని చెప్పింది.

తొమ్మిది అయ్యాకా చంద్రిక మళ్ళీ వెళ్ళి తలుపు తట్టింది. కానీ ఫలితం వెనకటి మాదిరే. లోపలినుంచి ఎటువంటి శబ్దం వినిపించట్లేదు. మామూలుగా ఆ సమయంలో అక్క టీవీ ప్రోగ్రమ్స్ చూడకుండా ఉండదు అని ఆలోచించినపుడు ఏదో అకారణ భయంతో ఆమె ఒక్కసారి తుళ్ళిపడింది. పగలంతా అక్క చాలా సంతోషంగా గడిపింది కదా అని మరుక్షణం తనని తాను సమాధానపరుచుకుంది. ఎన్నోరోజుల తరువాత ఆమె చాలా ఉల్లాసంగా కనిపించింది. ఆమె మంచి నిద్రలో ఉండి ఉంటుందని అనుకుని చంద్రిక తలుపును చాలాసార్లు తట్టింది. తరువాత గాజుకిటికీని కూడా తట్టిచూసింది. ఎయిర్ కండిషన్డ్ గది అయినా కూడా ఇన్ని సార్లు తలుపుకొట్టినా ఆమెకి తెలివిరాకుండా ఉంటుందా అని ఆలోచించినపుడు, చంద్రిక నరాలన్నీ ఒక్కసారి బిగుసుకుపోయాయి. ఏ కారణం చేతయినా స్పృహ తప్పిపోయిందా! రాత్రిళ్ళు నిద్రపట్టకపోతే ఏ కాంపోజో, వేలియమో తీసుకునే అలవాటు ఆమెకి ఉంది. ఇప్పుడేమైనా నిద్రమాత్రలు వేసుకుని పడుకుందేమో. ఇంకా గట్టిగా అరిచి, తలుపుతట్టి చంద్రిక గోల చేయడం విని చంద్రలేఖ కూడా పైకి వచ్చింది. భయంతో కాళ్ళూ, చేతులు ఆడలేదు కానీ, ఆమె కూడా కూతురిని బయటకి రప్పించడానికి అన్ని ప్రయత్నాలు చేసింది. ఈ లోపల చంద్రిక కిందికి వెళ్ళి తండ్రిని కూడా పైకి తీసుకువచ్చింది.

ఆరోజు ఆదివారం కావడం వల్ల, ఆ ఇంట్లో ఉన్న ఒకే ఒక్క పనిమనిషికి కూడా ఆరోజు శెలవు. భార్గవరాముడు, తన మిత్రులతో మధ్యాహ్నానికి ముందే బయటికి వెళ్ళాడు కానీ రాత్రి భోజనానికి ఇంటికి వస్తానని తల్లితో చెప్పి ఉంచాడు. చంద్రలేఖ వంటగదిలో పనిలో తలమునకలై ఉంటే, సీతాపతిరావు తన పడకగదిలో ఏదో చదువుతూ పడుకుని ఉన్నాడు. ఈ మధ్య ఆయన ఆ గది దాటడం భోజనానికి మాత్రమే. ప్రొద్దుటి నుంచి అర్ధరాత్రి వరకూ

సందర్శకుల సందోహాల సందడి భరించిన అతనికి ఇప్పుడు ఒంటరితనమంటే ఇష్టం ప్రారంభమయ్యింది.

చంద్రిక కంగారుగా చెప్పిన మాట విని సీతాపతిరావు పై అంతస్తుకి రెక్కలు కట్టుకుని వాలినట్టు చేరాడు. ఇక తలుపులు కొట్టే ఓపిక లేని అతను ఒక కర్ర తీసుకుని కిటికీ అద్దాన్ని పగలకొట్టాడు. లోపల లైట్లు వెలుగుతూ ఉండటం వల్ల, అతనికి ఆ దృశ్యం ఒక్క క్షణంలో అర్థమై పోయింది. ఏమీ అనకుండా పిచ్చి వాడిలాగా కిందకి పరుగెత్తుకొని వెళ్ళి ఒక గొడ్డలి తీసుకుని వెనక్కివచ్చి తలుపుపగలకొట్టాడు. ఈలోపల, పగిలిన కిటికీలోనుంచి లోపలికి చూసిన చంద్రలేఖ పిచ్చిపట్టిన మృగంలా అరిచి స్పృహతప్పి కిందపడిపోయింది. చంద్రిక బిగ్గరగా అరవడం మొదలుపెట్టింది. లోపలికి వెళ్ళిన సీతాపతిరావు ఇందూ మృతదేహాన్ని కిందకి దించి పరుపుమీద పడుకోబెట్టాడు. పైకి ఏడవలేదు కానీ, అతని మనసు మాత్రం అగ్నిగోళాలు పేలుతున్నట్లు ఏడుస్తుంది. చంద్రికను దగ్గరికి తీసుకుని ఊరడించడానికి చూశాడు కానీ, ఆమె ఏడుపు ఇంకా పెల్లుబికి రావడంతో,

"అమ్మా! ఇలా ఏడ్చి రచ్చ చెయ్యొద్దు. ఇరుగూ పొరుగూ పరుగెత్తుకు వస్తారు. కొంచెం సంబాళించుకో.........".

స్నానాల గదిలోంచి కొన్ని నీళ్ళు తీసుకువచ్చి, భార్య ముఖం మీద చల్లాడు, నిస్సత్తువగా వేలాడబడిపోతున్న భార్యని కూతురి మృతదేహం వద్దకు తీసుకువెళ్తూ,

"లేఖా! పెద్దగా ఏడవకు పక్కింటి వాళ్ళంతా వింటారు. మన అబ్బాయి భార్గవరాముడు వచ్చాకా ఇక ముందు ఏం చెయ్యాలనేది నిర్ణయం తీసుకుందాం. నువ్వు ఏడవ్వొచ్చు. కానీ బిగ్గరగా ఏడవ్వొద్దు........"

చల్లబడిపోయిన కూతురి మృతదేహం మీద పడి ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. చంద్రిక నోటికి చెయ్యి అడ్డు పెట్టుకుని ఏడుస్తూనే, అక్క శరీరం మీద ముద్దులు కురిపించడం, వళ్ళు నిమరడం చేయసాగింది. ఇందులేఖ రాసి పెట్టిన ఉత్తరాన్ని చదివిన సీతాపతిరావుకి కలిగిన పట్టలేని దుఃఖాన్ని పొంగుకొచ్చిన కోపావేశం అతిక్రమించింది. అతని రక్తం సలసలా మరగసాగింది. అతని మెదడులో ఒక పిచ్చి పిశాచి సంహారతాండవం చేస్తున్నాడు. ఆ పిశాచి ఎడంచేతిలో రక్తం కారుతున్న మొండెం లేని తల ..... తాండవకృష్ణ తల .......... వేలాడుతూ ఉంది ...... కుడి చేతిలో రుధిరదాహం తీరి, సంతృప్తితో నడుస్తున్న ఒక ఖడ్గం......

మరో పదినిముషాల్లో భార్గవరాముడు అతని సన్నిహిత మిత్రులైన మహారౌడీలు నలుగురూ వచ్చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం నాలుగూ, నాలుగున్నర వరకూ బీర్ తాగి, తరువాత సుష్టుగా భోజనం చేసిన ఆ యువకులు మంచి మూడ్‌లో ఉన్నారు. ఆ ఇంట్లో కూర్చుని ఇంకో మూడు, నాలుగు పెగ్గులు విస్కీ కొట్టేసి, వెళ్ళాలనే ఆలోచనలో ఉన్నారు ఆ నలుగురు మిత్రులు. ఆటపాటలతో కూడిన సుడిగాలిలా వారు పైన ఉన్న భార్గవరాముడి రూమ్‌లోకి పరుగెత్తుకుని వస్తున్నారు.

వెక్కి వెక్కి ఏడుస్తున్న తల్లిని, చెల్లిని, చలనరహితంగా పడిఉన్న ఇందూని చూసి భార్గవరాముడు నిర్ఘాంతపోయాడు. అతనికి మాత్రమే కాదు, అతని మిత్రులకి కూడా ఆ దృశ్యం చూసేసరికి సాయంత్రం వరకూ తాగిన మత్తు అంతా ఒక్కసారిగా దిగిపోయింది. సీతాపతిరావు కొడుకుని చూసి దగ్గరకి తీసుకున్నాడు. పుత్రిక దుర్మరణం గురించి తండ్రి ఎదలో చెలరేగిన ఆర్తనాదం, భార్గవరాముడి గుండెలో ప్రతిధ్వనించింది. సీతాపతిరావు, కొడుకుని అతని రూములోనికి లాక్కుని వెళ్ళి, కూతురు రాసి పెట్టిన ఉత్తరాన్ని చూపించాడు. భార్గవరాముడు కోపంతో మండిపోయాడు.

"డాడీ! ఇవ్వాల్టికి నన్నాపకండి, ఈ రోజు మన ఇందూ పెళ్ళి ఆ బాస్టర్డ్ మురళితో జరిపిస్తాను. నేను వెళ్ళి అరగంటలో తిరిగివస్తాను. అప్పటివరకూ పోలీసులకు ఫోన్ చేయవద్దు."

తన తండ్రిని బయటకు పంపించి, భార్గవరాముడు తన మిత్రులని లోపలకి పిలిచి, తదుపరి కార్యక్రమం గురించి రెండు మూడు నిముషాల పాటు చర్చించాడు. అలమరా తెరిచి కొన్ని సామాన్లు వాళ్ళు తీసుకున్నారు. వాళ్ళందరూ చేతికి గ్లవుసులు తొడుక్కున్నారు. భార్గవరాముడు ఒక చిన్నపిస్టల్‌ని కూడా జేబులో పెట్టుకున్నాడు. 'కింకరుల' చేతిలో వాళ్ళ వాళ్ళ కత్తులున్నాయి. చిన్నా పెద్దా తాళ్ళు తీసుకోవడం కూడా వాళ్ళు మరిచిపోలేదు. ఒక తీవ్ర గర్జనతో భార్గవరాముడి కారు బయలుదేరింది.

పదినిముషాల తరువాత తాండవకృష్ణుడి ఇంటిడోర్ బెల్ మోగింది. ఆ ఇంటి పనివాడు పీటర్ వచ్చి తలుపుతీశాడు.

"మీరా అయ్యగారు! ఫ్రెండ్స్‌తో ఇంత లేటుగా........"

"నువ్వు ఒక్కడివే కదా ఇక్కడున్నది?" భార్గవుడు కొంచెం గొంతు తగ్గించి అడిగాడు.

"కాదయ్యగారూ, తండ్రీ కొడుకులు లోపల ప్రోగ్రామ్ జరిపిస్తున్నారు."

"అది కాదురా నేనడిగేది. నువ్వు తప్ప వేదే పని మనుషులెవరూ లేరు కదా అని."

"ఇంకెవరూ లేరయ్యా, పనిమనుషులు, డ్రైవర్లు అందరూ వెళ్ళిపోయారు.

ఇక రేపొద్దుటి వరకూ ఎవరూ రారు. ఎవరినయినా పిలిపించాలా అయ్యగారూ?"

"అక్కర్లేదక్కర్లేదు, చూడు పీటర్ ఇప్పుడు నేను చెప్పేది శ్రద్ధగా విను. ఇక్కడ జరగబోయేది నువ్వేమీ చూడలేదు. ఇక నువ్వు ఈరోజు నుంచి నేను చెప్పినట్లు చెయ్యాలి. ఏదైనా గుట్టు బయట పెట్టావంటే నీ సంగతి, నీ కూతురు సంగతీ తేలుస్తా."

కూతురి విషయం వినగానే పీటర్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. "ఓ మైగాడ్! నా కూతురు ఈ వెధవల చేతిలో పడితే ఏమవుతుందో" అన్న ఆలోచనే అతను ఉలిక్కిపడటానికి కారణం.

"నేను ఎవరితో ఏం చెప్పనయ్యా, కానీ ఏమిటి? ఏమిటి........"

ఇంకేమడగడానికి పీటర్‌కి అవకాశం దొరకలేదు. బాగా రిహార్సల్స్ చేసి వచ్చినట్టు ఆ పంచపాండవులు లోపలికి వెళ్ళి ఇద్దరిద్దరు చొప్పున తండ్రీకొడుకులిద్దరినీ కుర్చీలోనుంచి లేవకుండా గట్టిగా పట్టుకున్నారు. ఆ తండ్రీకొడుకులు అప్పటికే నాలుగైదు పెగ్గులు తాగి ఉండటం వల్ల జరుగుతున్నది అర్థంకాక ఏదేదో అడగసాగారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా భార్గవరాముడు, తనతో తీసుకువచ్చిన విస్కీ సీసా మురళీకృష్ణ తల పైకెత్తి, నోట్లో కుక్కి పోయడం మొదలు పెట్టాడు. మరొకడు, ఆ టేబిల్ పైన ఉన్న విస్కీ బాటిల్ తీసుకుని వకీలు పై ఇదే ప్రయోగం చేశాడు. ఆ తండ్రీ కొడుకులిద్దరూ ఉక్కిరి బిక్కిరై తుమ్ముతున్నారు, దగ్గుతున్నారు, రెండూ కలిపి చేస్తున్నారు. ఆ రౌడీల ఆగడాల వల్ల కాబోలు, భయపడి గంతులేస్తున్న ఆ విస్కీ ఆ రెండు తరాల వారి కడుపుల్లోకి వెళ్ళాలా లేక ఊపిరితిత్తులలోకి వెళ్ళాలా అని ఆలోచించుకోకుండా గల గలా లోపలికి పారిపోతోంది. సీసాలు ఖాళీ కాగానే, ఆ తండ్రీ కొడుకులిద్దరూ దగ్గడం, తుమ్మటంతో పాటు కక్కడం కూడా మొదలు పెట్టబోతున్నట్లుగా ఉంటే, ఆ రౌడీలు వాళ్ళ నోళ్ళు మూసి,

నెత్తుల మీద మొత్తటం మొదలు పెట్టారు. భార్గవ రాముడు, మరో ఇద్దరూ, కలిసి మురళిని ఎత్తుకుని పక్కనే ఉన్న అతని బెడ్‌రూమ్ లోకి తీసుకు వెళ్ళి లోపలినుంచి తలుపు వేసేశారు. మూసిన తలుపుల వెనకాల ఏం జరుగుతోందో తెలుసుకోవాలనే ఉత్కంఠ గానీ, ఆదుర్దాగానీ తాండవకృష్ణ మస్తిష్కాన్ని వేధించలేదు. పీటర్ సహాయంతో మిగిలిన ఇద్దరూ, ఆ వకీలుని తీసుకు వెళ్ళి పడకగదిలో పడుకో బెట్టారు. అప్పుడు అతను స్పృహ తప్పి ఉన్నాడు లేకపోతే స్పృహ తప్పినట్టు నిద్రపోతున్నాడు. ఆ ఇద్దరు యమకింకరులు పీటర్ మురళి గదిలోనికి వెళ్ళడానికి అనుమతించలేదు.

అయిదు నిముషాల తరువాత కిటికీ ద్వారా మురళి గదిలోకి చూసి పీటర్ గట్టిగా ఏడవటం మొదలు పెడితే ఆ ఇద్దరిలో ఒకడు పీటర్ నోరుమూసి ఏడ్వవద్దని గట్టిగా చెప్పడం జరిగింది. మురళి సీలింగ్ ఫాన్‌కి ఉరివేసిన భార్గవ రాముడు అతని ఇద్దరు మిత్రులు ఆ గది తలుపు లోపలినుంచి గడియ వేసినట్టుగా చూపించడానికి వాళ్ళు తీసుకు వచ్చిన తాడుతో రకరకాల అభ్యాసాలు చేసి, ఆఖరికి ఆ ప్రయతంలో విజయం పొందారు. ఇక పోలీసులు వచ్చి కూడా లోపలినుంచి తలుపులు మూసి ఉండటంతో అది ఒక ఆత్మహత్య కేసే అవుతుంది.

కళ్ళూ, నాలుక బయటకు వచ్చి, మల మూత్ర విసర్జన చేసి ఎంతో జుగుప్సాకరంగా కనపడుతున్న మురళి మృతదేహాన్ని చూసి నిశ్చేష్టుడైన పీటర్‌ని

"ఒరే పీటర్! రేపు ఉదయం వకీలయ్యని నువ్వు లేపవద్దు. ఆ పని పోలీసులు చేసుకుంటారు. ఉదయం ఏడున్నర, ఎనిమిదికి పోలీసు స్టేషన్‌కి ఫోన్ చేసి వివరం తెలపాలి. ఆ వివరం ఏమిటనేది నీకు తెలుసా? ఉదయం నువ్వు కాఫీ తీసుకుని మురళి గది తలుపు తడితే అతను తలుపు తీయకపోయేసరికి, నువ్వు కిటికీ లోనుంచి మురళి సీలింగ్ ఫాన్‌కి వేలాడుతూ కనిపించిందని

చెప్పాలి, అంతే. ఈ రాత్రికి మేమిక్కడికి రాలేదు. అర్థమయిందా? తండ్రీ కొడుకులు పీకల దాకా తాగి, ఏదో విషయంలో దెబ్బలాడుకున్న తరువాత, వారిద్దరూ ఎవరి గదిలోకి వాళ్ళు వెళ్ళి తలుపులు వేసుకున్నారు. ఇంకా నీకు ఈ విషయంలో సందేహాలేమైనా ఉన్నాయా? ఈ రోజు నుంచి నువ్వు నామనిషివి. నీకేం కావాలన్నా నన్ను అడుగు. ఈ రహస్యం బయట పెట్టావంటే నువ్వు కూడా ఇలాగే చస్తావు. కానీ, మీ అమ్మాయి మాత్రం మేము చంపము. మేము ఐదుగురమున్నాము కదా! అర్థమయిందా? " అని భీకర స్వరంతో భార్గవరాముడు హెచ్చరించాడు.

తరువాత అతను తన ఇంటికి ఫోన్ చేసి, "డాడీ ! ఇక్కడ జరగాల్సిన పెళ్ళి జరిగి పోయింది. ఇక మీరు స్టేషన్‌కి ఫోన్ చేసి పోలీసులను ఇంటికి పిలిపించండి. వాళ్ళు వచ్చేలోగా నేను ఇంటికి చేరుకుంటాను" అని చెప్పాడు.

స్నేహితులను దారిలో వదిలేసి భార్గవ రాముడు ఇంటికి చేరుకున్నాడు. మరో అయిదు నిముషాల్లో పోలీసులు కూడా వచ్చేశారు. మృతదేహాన్ని పరుపుమీద పడుకో పెట్టడం చూసి ఇన్స్పెక్టర్ సీతాపతిరావుతో, "అయ్యో సార్! సీన్ మొత్తం డిస్టర్బ్ చేసేశారే. డెడ్ బాడీని ఎవరూ టచ్ చేయకుండా ఉండవలసింది. "

" ఓయ్ ఇన్స్పెక్టర్" అని కొంచెం కోపంతో భార్గవరాముడు మొదలు పెట్టేసరికి, సీతాపతిరావు అతన్ని ఆగమని సైగ చేసి.

" ఆఫీసర్ ! ఒక కూతురు ఉరిపోసుకు వేలాడుతూ ఉంటే ఏ తల్లికిగాని, తండ్రికి గాని చేతులు కట్టుకుని చూస్తూ నిలబడటం సాధ్యం కాదు. తలుపులు పగల కొట్టి లోపలికి రాగానే బంగారు తల్లిని ఆ ఉరితాడు విప్పి పరుపు మీద పడుకో పెట్టడమే చేసిన మొదటి పని. ఆ సమయంలో అమ్మాయి

చచ్చిపోలేదనే ఆశ ఏ మూలనైనా ఉండటం మానవసహజం."

" అయితే డాక్టర్‌ని ఎందుకు పిలిపించలేదు ?"

"పరుపు మీద పడుకోపెట్టేటప్పుడు నాకు అర్థమైంది. ఆమె చనిపోయి చాలా సేపైందని, అందుకే కదా ఆమె కళ్ళు కూడా మూయలేక పోయాను."

"అయితే వెంటనే స్టేషన్‌కి ఎందుకు ఫోన్ చేయలేదు ? "

" ఆఫీసర్ ! కూతురు శవమై పడి ఉంటే, మృత దేహం మీద పడి ఏడవాలా? లేక మిమ్మల్ని పట్టుకుని నవ్వాలనా? ఏమి తోస్తుంది ?" అని సాధారణంగా సమచిత్తత కోల్పోని సీతాపతి రావు, దాచుకోలేని నీరసభావంతో అడిగాడు.

"సారీ సార్! దయచేసి నన్ను అపార్థం చేసుకోవద్దు. మా కార్యక్రమాలు మేము మొదలు పెట్టకోవచ్చా ? "

" మొదలు పెట్టండి కాని పోస్ట్‌మార్టమ్ చేయకుండా బాడీని మాకు ఇస్తారా?"

" సార్ అలా చెయ్యడానికి నాకు అధికారం లేదు. కావాలంటే మీరు కమీషనర్‌తో గానీ, డిప్యూటీ కమీషనర్‌తోగానీ మాట్లాడి చూడండి. కానీ, వాళ్ళకు కూడా అలాంటి పర్మిషన్ ఇవ్వడం కష్టం. మీరు ఈ విషయం నాకే వదిలి పెడితే, డాక్టర్‌తో మాట్లాడి, పోస్ట్ మార్టమ్ ఒక ఫార్మాలిటీగా చేయించి, బాడీ అలాగే మీకు అప్పచెపుతాను. దాదాపు ఉదయం తొమ్మిది గంటలకు బాడీ మీరు తీసుకు వెళ్ళొచ్చు. పది పదిన్నర కల్లా క్రిమేషన్‌కి కావాల్సిన

ఏర్పాట్లు మీరు చేసుకోవచ్చు."

"థాంక్యూ ఆఫీసర్, యూ మే ప్రోసీడ్ విత్ యువర్ వర్క్. " మా డీటైల్డ్ స్టేట్‌మెంట్సన్నీ రేపు ఇవ్వొచ్చు కదా."

" చాలు సార్. ఇటీజ్ ఎ క్లియర్ కేస్ ఆఫ్ సూసైడ్. అందుకే ఈ కేసులో ఎలాంటి కాంప్లికేషన్స్ ఉండవు."

పోలీసులు వాళ్ళ కార్యక్రమాలు మొదలు పెట్టారు. ఆ కుటుంబానికి ఆ రాత్రి ఒక కాళ రాత్రిగా గడిచింది.

• • •

తాండవకృష్ణ ఇంట్లో ఆ లాయరు సుష్తావస్థలో పెద్దగా గురకలు పెడుతూ నిద్రపోతున్నాడు. మురళి అయితే చాలా నిశ్శబ్దంగా వేలాడుతూ నిద్రపోతున్నాడు..... ఇక ఎప్పటికీ లేవని నిద్ర. పాపం, పీటర్ మాత్రం నిద్రపోలేదు. భయంతో గడగడా వణుకుతూ పడిఉన్నాడు. కోడికూత జామైనా అతనికి కళ్ళు మూత పడలేదు.

• • •

ఆ రాత్రి పోలీసులకి పని కొంచెం ఎక్కువ అయింది. కానీ, ఆ కేసులో ముద్దాయిని వెదకాల్సిన ఖర్మ లేదు కదా అని కొంత ఊరట కలిగింది. అర్ధరాత్రి రెండున్నర దాకా ఏవేవో పనులు చూసుకుంటూ ఇనస్పెక్టర్ అలా స్టేషన్‌లోనే చిన్న కునుకు తీశాడు.

• • •

సోమవారం ఉదయం ఏడుగంటలు పది నిమిషాలు. ఇనస్పెక్టర్ రమేష్‌కుమార్‌ని హెడ్‌కానిస్టేబుల్ తట్టి లేపి, ఓ విషయం చెప్పేసరికి నిర్ఘాంత పోయాడు. ఒక్క రాత్రిలో రెండు ఆత్మహత్యలా ! పెళ్ళి కుదిరి అమ్మాయి, అబ్బాయి ఒకే రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరికిద్దరూ గొప్పింటి పిల్లలే. వీళ్ళ ప్రేమ కథలోకి విలన్ ఎవరై ఉండాలి? వీళ్ళని ఆత్మహత్య చేసుకునే వరకు ఎవరు తీసుకు వచ్చారు? అన్నీ సుఖైశ్వర్యాలు ఉన్న ఈ అమ్మాయి, అబ్బాయి ఎందుకు ఈ పని చేశారు? దీనికి ప్రేరణ ఎవరు కలిగించి ఉంటారు? వాళ్ళిద్దరూ కలిసి బాగా ఆలోచించుకుని ఈ నిర్ణయానికి వచ్చుంటారు. ఇటీజ్ ఎ కేస్ ఆఫ్ సూయిసైడ్ ప్యాక్ట్. ఇలా ఆలోచిస్తూ కూచోవడానికి టైమ్ లేదు. ఆ వకీలు ఇంత వరకూ లేవలేదట. ఆ ఇంటి వంటవాడు ఫోన్ చేసాడట. ఇదేం ఆశ్చర్యం.....కొడుకు ఉరితాడులో వేలాడుతూ ఉంటే, తండ్రి హాయిగా ఎలా నిద్రపోతాడు. ఆ బట్లర్ ఏమన్నా తాగి మాట్లాడుతున్నాడా ? ఏమైనా సరే నేను పోక తప్పదు. ఇందులేఖ పోస్ట్‌మార్టమ్ గురించి ఒక సబ్ ఇనస్పెక్టర్‌కి నిర్దేశాలిచ్చి, ఇనస్పెక్టర్ తాండకృష్ణ ఇంటికి బయలుదేరాడు.

అక్కడ పీటర్ ముళ్ళమీద నిలబడినట్టు భయాక్రాంతుడై ఉన్నాడు. ఇనస్పెక్టర్ అక్కడికి చేరేలోగా, ఆ ఇంటి పనివాళ్ళు ఇద్దరూ కూడా వచ్చేశారు. ధనిక కుటుంబానికి చెందిన ఒక యువకుడు నేల మీద కాళ్ళు పెట్టకుండా నిలబడిన దృశ్యాన్ని చూసిన చరితార్థతాతో, ఆ ఆత్మహత్య వెనుక ఉన్న అదృశ్య హస్తం ఎవరిదై ఉంటుందా అనే విషయాన్ని విశదంగా చర్చిస్తూ ఇరుగు పొరుగు బృందం ఒకటి గేటు బయటే నిలబడి ఉంది. పోలీసు జీప్ రావడం చూసి ఆ కేసులో సాక్ష్యం ఏమైనా ఇవ్వాల్సి వస్తుందేమోననే భయంతో ఆ పౌరకర్తవ్య తత్పరులు ఆ గేటు వైపు కాకుండా, తక్కిన దిశలకి మెల్లగా మాయమై పోయారు.

భార్గవ రాముడు నిర్దేశించిన ప్రకారంగా, పీటర్ రాత్రి జరిగి విషయం, ఉదయం తను చూసి భయపడిపోయిన ఆదృశ్యాన్ని గురించి చాలా విశ్వాస యోగ్యమైన రీతిలో ఆ ఇనస్పెక్టర్‌కి వివరించాడు. ఇందులేఖ ఆదివారం ఉదయం ఆ ఇంటికి రావడం, మురళి గదిలో ఒక గంట సేపు చర్చించడం గురించి పీటర్ చెప్పిన తరువాత, ఆ ఇనస్పెక్టర్‌కి సూసైడ్ ఫ్యాక్ట్ అనే తన థియరీ మీద మరింత నమ్మకం కుదిరింది.

ఎనిమిది దాటిన తరువాత కూడా తాండవ కృష్ణ లేవలేదు. కిటికీలోనుంచి సీలింగ్ ఫాన్‌కి వేలాడుతున్న మురళీ కృష్ణని, ఆ పరిసరాలని పరిశీలించిన ఇనస్పెక్టర్ పీటర్‌తో తాండవకృష్ణను లేపమని చెప్పాడు. అతను ఎంత పిలిచినా లేవకపోవడంతో, పీటర్ ఇనస్పెక్టర్ చెప్పినట్టు తాండవకృష్ణ ముఖం మీద నీళ్ళు చల్లాడు. ఇంగ్లీషులో బూతు మాటలు తిడుతూ లేచాడు కానీ, తల పగిలి పోతునట్టుగా అనిపించడంతో, రెండు చేతులతో తల పట్టుకుని మళ్ళీ పడుకున్నాడు. ఇనస్పెక్టర్ గారి గొంతు విని తాండవ కృష్ణ లేవక తప్పలేదు. తాగిన మత్తులో ముద్దగా మాట్లాడుతూ తాండవకృష్ణ "వాట్ ఇనస్పెక్టర్ ఇంత ఎర్లీగా ......"

"మీలాంటి వాళ్ళు ఇంత ఎక్కువగా తాగితే మాలాంటి వాళ్ళు రాకుండా ఎలా ఉంటారు ? "

"ఎక్కువ తాగితే ఏమయింది ? ఇక్కడ ప్రొహిబిషన్ ఏమైనా ఉందా?"

"ప్రొహిబిషన్ లేకపోయినప్పటికీ మీరు ఇంత ఎక్కువగా తాగడం వల్లనే కదా....." అని ఇనస్పెక్టర్ తన మాట పూర్తి చేసే ముందే అతన్ని ఆపి "నా అంతట నేను తాగడం కాదు, వాళ్ళు బలవంతంగా నన్ను, మురళిని తాగించారు. పీటర్ ఆ విషయం మీతో చెప్పలేదా?" అని వకీలు అడిగారు.

" సార్ నేను బయట వెయిట్ చేస్తాను. మీరు త్వరగా బయటికి రండి. విషయం కొంచెం సీరియస్.." అనిచెప్పి వకీలు ప్రతిస్పందన కోసం ఎదురు చూడకుండా రమేష్‌కుమార్ బయటికి వెళ్ళాడు.

విషయం ఏమిటో అర్థం కాక, కొద్దిగా కంగారు పడిన తాండవకృష్ణ బాత్రూమ్‌కి వెళ్ళి, ఒక గౌను వేసుకుని బయటకు వచ్చాడు. ఏమీ చెప్పకుండా, ఇనస్పెక్టర్ అతనిని మురళి గది కిటికీ దగ్గరకి తీసుకు వెళ్ళాడు. లోపలి దృశ్యాన్ని చూసి వెంటనే అతని ముఖం ఎంతో వికృతంగా మారింది. రెండు క్షణాల పాటు అతని శరీరం ఒక శిలగా మారింది. మరో క్షణంలో ఆ శిల పేలింది.

"ఇనస్పెక్టర్ ! ఇది వాళ్ళు చేసిన ఘోరకృత్యం, పీటర్! పీటర్! ఇది ఎలా జరిగింది. చెప్పరా చెప్పు." అని అతను ఒక భస్మాసురుడులా గర్జించాడు.

"ఈ కేసు గురించి ఇన్వెస్టిగేట్ చేయడానికే నేను వచ్చాను. తలుపు లోపలి నుంచి వేసేసి ఉండటం వల్ల ఇపుడు దానిని పగుల కొట్టాలి" అని రమేష్ కుమార్ చెప్పాడు. అది నమ్మలేనట్టు తాండవ కృష్ణ కిటికీలోనుంచి లోపలికి తొంగి చూసి గట్టిగా అరిచాడు " ఇనస్పెక్టర్ ఇది పెద్ద మోసం. ఇటీజ్ జస్ట్ మేడ్ టు అప్పియర్ లైక్ దట్. పీటర్ మీతో దీని గురించి చెప్పాడు కదా? ఏరా పీటర్! నీ నోరు పడిపోయిందా? మాట్లాడవేం?"

" సార్ హి ఈజ్ డంబ్ ఫౌండెడ్. అతన్ని స్టేషన్‌కి తీసుకు వెళ్ళి ఇంటరాగేట్ చేస్తాను. ఇప్పుడు ఇమ్మీడియట్‌గా తలుపు తెరవాలి. కమాన్ కానిస్టేబుల్స్, తలుపు పగలకొట్టండ్రా...." అని రమేష్‌కుమార్ ఆదేశించాడు.

"ఇనస్పెక్టర్ అంతకన్నా ముందు డాగ్‌స్క్వాడ్‌ని రప్పిస్తే మంచిది కదా. సీన్ డిస్టర్బ్ చేసే ముందు అలా చేస్తే......."

" సార్! నా పనేదో నేను చూసుకోగలను. డాగ్‌స్క్వాడ్ అవసరమనిపిస్తే నేను రప్పించుకుంటాను. కానీ ముందు డెడ్‌బాడీ క్లోజ్‌లుక్ నాకు కావాలి."

"బట్ ఇన్‌స్పెక్టర్ దిసీజ్ ఎకేస్ ఆఫ్ మర్డర్. నిన్న రాత్రి వాళ్ళు నా కొడుకుని చంపేసి వేలాడదీసారు. చెప్పరా పీటర్! చెప్పు జరిగినదంతా చెప్పు."

"వాళ్ళు వాళ్ళు అంటున్నారు. ఎవరు వాళ్ళు?"

"దోజ్ బాస్టర్డ్స్. సీతాపతి కొడుకు వాడి గూండా ముఠా. ఇన్‌స్పెక్టర్! ఇన్‌స్పెక్టర్! ఐ విల్ టాక్ టు యువర్ కమిషనర్. యూకెన్ ఓపెన్ ది డోర్ ఆఫ్టర్ దట్....."

"సార్! వారు నాకు మాత్రమే కమిషనర్ కాదు. ఈ సిటీ మొత్తానికి కమిషనర్. ఈ కేసు గురించి నేనే ఆయనతో మాట్లాడాలి. కానీ, మొట్టమొదట నేను డెడ్‌బాడీని దగ్గరగా పరిశీలించాలి."

ఈ లోపల ఇద్దరు కానిస్టేబుల్స్ ఆ తలుపు పగలకొట్టగలిగారు. అలా పగల కొట్టడం వలన లోపల గడియ ఊడిపడింది. ఇంతలో పోలీస్ ఫోటోగ్రాఫర్ వచ్చి శవాన్ని ఫోటో తీయడం మొదలుపెట్టారు. హోమ్ మినిస్టర్‌కి, కమిషనర్‌కి, డిప్యూటీ కమిషర్‌కి, ఇతర పోలీసు అధికారులకు ఫోన్ చేయడానికి ప్రయత్నించి బయటికి వచ్చిన తాండవకృష్ణ

"ఒక్కడూ దొరకటల్లేదే? వీళ్ళందరూ కలిసి బాత్‌రూంలో ఏం చేస్తున్నారు!" అని అతను తన కోపం, అసహ్యత వ్యక్తం చేశాడు.

"మీలా తొమ్మిది గంటల వరకూ నిద్రపోవడం వాళ్లకు కుదరదు కదా! ఆఫీసుకి వెళ్ళడానికి వాళ్ళు సిద్ధం కావద్దా?" అని అడగకుండా ఉండలేకపోయాడు ఇనస్పెక్టర్.

"ఇనస్పెక్టర్! దయచేసి ఎవిడెన్స్ ఏదీకూడా తారుమారు కాకుండా చూడండి. నా కొడుకుని చంపినవాళ్ళకి మరణశిక్ష పడితేనే అతని ఆత్మకి శాంతి కలుగుతుంది...... నాకు కొంచెం మనశ్శాంతి కూడా" అని వేదన కంటే కోపాన్ని ఎక్కువ వ్యక్తం చేస్తూ చెప్పాడు.

"సార్! ఆ సీతాపతి కొడుకు నిన్న రాత్రి వేరే పనిలోమునిగి ఉన్నాడు" అని ఇనస్పెక్టర్ కొంచెం ఆగి ఆగి చెప్పాడు.

"వేరే పనా? వాట్ డూయూ మీన్?"

"సర్! నిన్న రాత్రి వాళ్ళ ఇంటిలో కూడా ఇలాంటి ఒక దురంతం జరిగింది. ఆ ఇంటి పెద్దకూతురు కూడా ఇలాగే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నేను అక్కడికి వెళ్ళేటప్పటికి వాళ్ళందరూ అక్కడ ఏడుస్తూ కూర్చున్నారు."

"మీరు ఎన్నిగంటలకి అక్కడికి వెళ్ళారు?".

"పదిన్నర, పదకొండు కావచ్చు. అప్పటినుంచి రెండున్నర వరకూ ఆ భార్గవరాముడు నాతోనే ఉన్నాడు."

"ఇనస్పెక్టర్? ఇది చాలా జాగ్రత్తగా హేండిల్ చేయాల్సిన కేసు. వాళ్ళు మా ఇంటికి వచ్చి నన్ను నా కొడుకుని విస్కీ బలవంతంగా తాగించేటపుడు

దాదాపు రాత్రి పదిగంటలవుతుంది. మీరు సీతాపతి ఇంటికి వెళ్ళేటప్పటికి అతను అక్కడ ఉన్నాడంటే......."

"సార్! మీరేం భయపడద్దు. గంటలు, నిముషాలతో సహా నేను రాసి పెట్టాను. ఈ కేసు ఇన్వెస్టిగేషన్ అంతా నేను సక్రమంగానే చేస్తాను. కానీ, మీకు నా మీద నమ్మకం లేకపోతే, కమిషనర్‌తో మాట్లాడి, వేరే ఐ.ఓ ని ఏర్పాటు చేయించండి."

"నాకు మీ మీద నమ్మకం అయితే ఉంది, బట్ ఐ వాంట్ రిజల్ట్స్."

తాగి, స్పృహకోల్పోయినట్టు నిద్రపోయిన అతనికి, తన ఏకైక కుమారుడు చనిపోయిన విషయం పూర్తిగా అవగతం కాకపోడంవల్లనేమో, లేక మరణాలు, హత్యలు ఇత్యాది ఎన్నో సంవత్సరాల తరబడి, చూసి, విని, మనసు కఠోరమై పోవడం వల్లనేమో, ఒకసారి వెక్కివెక్కి ఏడవటానికి కానీ, రెండు చుక్కలు కన్నీరు కార్చడానికి కానీ సాధ్యం కాలేదన్న విషయం గమనించిన ఇనస్పెక్టరుకు ఆశ్చర్యం కలిగింది. కొడుకు దుర్మరణం........ అదీ కూడా ఆత్మహత్య, అలాంటి దురంతాన్ని కూడా, తన స్వార్థ లాభంకోస వినియోగించాలనే ప్రయత్నంలో మునిగి ఉన్న ఆ వకీలు తీరు చూసి, అతను కర్నూలులో గానీ కడపలో గానీ, పరంపరాగతమైన తగవులున్న ఏదైనా కుటుంబంలో పుట్టి ఉంటే, అది మొత్తం ఆ రాయలసీమకే శ్రేయస్కరమవుతుందని అనుకున్నాడు ఇనస్పెక్టర్ రమేష్‌కుమార్.

• • •

రమేష్‌కుమార్ తన పై ఆఫీసరుకు ఆ రెండు హత్యల గురించి దీర్ఘవివరణ ఇవ్వడం జరిగింది. అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఉదయం పదిన్నర పదకొండు గంటలకే రెండు సంఘటనా స్థలాలను సందర్శించి వివరాలు స్వయంగా తెలుసుకోవడంతో, వారిద్దరికీ మురళి మరణం హత్య కాదని పూర్తిగా రూఢి అయింది. ప్రస్తుతానికి, వకీలు చేతినుంచి తప్పించుకున్న పీటర్, పోలీస్‌స్టేషన్లో ఇచ్చిన వాంగ్మూలం వాళ్ళకు నమ్మదగినదిగా అనిపించింది. మురళి, ఇందులేఖల వివాహానికి, తాండవకృష్ణ అనుమతించకపోయేసరికి ఆ యువమిథునాలు ఒక అంతిమ తీర్మానానికి వచ్చిఉంటాయని వాళ్ళు అర్థం చేసుకున్నారు. వాళ్ళ మనోదిగంతాలలో ఇందు, మురళిలు అనశ్వర ప్రేమకు దృష్టాంతాలుగా, స్వర్గోన్ముఖులై పయనిస్తున్నారు. ఆ యువతీ యువకులు, ఆత్మహత్యా ఒప్పందంతో ఒకే సమయంలో, ఒకే రీతిలో తమ తమ బెడ్‌రూముల్లో లోపలనుంచి తలుపు వేసేసుకుని ఉరి వేసుకున్నారు! ఇలాంటి పరిస్థితులలో అనుమానానికి ఆస్కారమెక్కడిది? ఎవరిని అనుమానించాలి? ఎందుకు అనుమానించాలి?

కానీ తాండవకృష్ణ ఆ విధంగా వదిలిపెడ్తాడా? అతను చీఫ్ మినిష్టర్‌ను, హోంమినిష్టర్‌ను సంప్రదించి, తన కొడుకు ఆత్మహత్య కేసును, ఒక హత్య కేసుగా మార్పించాడు. భార్గవరాముణ్ణి నాలుగైదు రోజులు పోలీసుస్టేషన్‌లో ఉంచి, ఇంటరాగేట్ చేసినా, నిజాన్ని రాబట్టలేక పోయారు. కానీ, ఈ లోగా, తాండవకృష్ణ పీటర్‌ని ఎక్కడికో తీసుకువెళ్ళి బాగా దేహశుద్ధి చేసి, అతని చేత నిజాన్ని కక్కించాడు. తరువాత అతన్ని ముఖ్యమంత్రి దగ్గరికి, హోంమంత్రి దగ్గరకి తీసుకువెళ్ళి వాళ్ళముందు నిజాన్ని చెప్పించడం జరిగింది. ఆ రాజకీయనాయకులిద్దరికీ సీతాపతినీ, అతని కొడుకుని, వేధించాలని మహా ఆసక్తిగా ఉండేది. ఆ తండ్రీకొడుకులిద్దరినీ అరెస్టు చేయించాలని ఆ నాయకులు అనుకున్నా, వారిద్దరూ ఏంటిసిపేటరీ బెయిల్ తీసుకోవడం వల్ల, తరచు వారిని పోలీస్‌స్టేషన్‌కి రప్పించి ప్రశ్నించడానికీ ఆ వేధింపు పరిమితమయింది.

భార్గవరాముడి మిత్రులందరినీ స్టేషన్‌కి పిలిపించి ప్రశ్నించడం జరిగింది. కానీ, దాని వల్ల ప్రయోజనం లేకపోయింది. ఇది ఇలా ఉండగా, ఇనస్పెక్టర్ రమేష్‌కుమార్‌కి అక్కడి నుంచి బదిలీ అయి, తాండవకృష్ణకి సన్నిహితుడైన మరో ఇనస్పెక్టర్ ఆ స్థానంలో వచ్చిచేరాడు. దానితో పరిస్థితులు తారుమారై పీటర్ సాక్ష్యం ఆధారంగా, ఆ ఇనస్పెక్టర్, భార్గవరాముడు, అతని నలుగురు అనుచరులను బాగా ఇరికించేశాడు. నీచుడైన ఆ ఇనస్పెక్టర్ భార్గవరాముణ్ణి, అతని నలుగురు మిత్రులను నుగ్గునుగ్గు చేశాడు. కానీ, ఆ అయిదుగురు శిలారూప పాండవులుగా వర్తించగలిగారు. ఆ కేసుకి కావాల్సిన సాక్ష్యాధారాలు ఇవ్వగలిగిన వాళ్ళు ఇద్దరే మిగిలారు. ఒకడు మృతుడి తండ్రి, రెండోవాడు అతని మృతప్రాయుడైన వంటవాడు. రెండోవాడి సాక్ష్యమే ఆ కేసులో కీలకమైనది. మొదటి సాక్షి, హత్యగానీ, మరణం కానీ జరిగిన ఆ రాత్రి, మితిమించిన మద్య ప్రభావం వల్ల స్పృహకోల్పోయినట్టు నిద్రపోయాడు కదా. పోలీసులు మర్నాటి ఉదయం వచ్చికదా అతన్ని లేపారు.

పీటర్‌ని హేండిల్ చేయడంలో తాండవకృష్ణ కొంచెం లౌక్యాన్ని చూపుంటే బావుండేది. కానీ, అతను ముందు భార్గవరాముడి పక్షం వహించటంవల్లనే కదా, తాండవకృష్ణ అతన్ని ఊరవతలకి తీసుకువెళ్ళి చిత్రహింసలు పెట్టి నిజం కక్కించాడు. తరువాత, పోలీసుల ముందు మాత్రమే కాదు, చీఫ్‌మినిష్టర్, హోంమినిష్టర్ సమక్షంలో ఆ పనివాడి చేత నిజాన్ని బయటపెట్టించిన తరువాత తాండవకృష్ణకి ధైర్యం ఎక్కువయింది. ఒంటరిగా ఉన్నప్పుడల్లా ఉరివేసుకుని ఉన్న కొడుకు భయానకదృశ్యం కళ్ళముందు కదలాడుతుండటంతో అతనికి మనశ్శాంతి కరువైంది. కూతురు ఇంట్లోంచి వెళ్ళిపోయిన తరువాత అతనికి మిగిలిన ఏకైక ఆశాకిరణం ఈ కొడుకే. మురళి ఆత్మహత్య విషయం తెలియగానే, హరి, అనూరాధ ఆ ఇంటికి పరుగెత్తి వెళ్ళారు. కానీ, తాండవకృష్ణ వాళ్ళని ఇంట్లోకి అడుగుపెట్టనివ్వలేదు. అతనికి ఇపుడు జీవిత లక్ష్యమనేదే లేకుండా పోయింది.......... కల్తీలేని ఒంటరితనంతో మిగిలిపోయాడు. ప్రతీకార భావమనే

ఏకైక లక్ష్యం మాత్రం అతనిలో మిగిలిపోయింది. తనకొడుకుని చంపిన భార్గవరాముణ్ణి ఎలాగైనా నాశనం చేయాలనే ఒక కోరిక మాత్రం అతని మనసులో జ్వాలలా చెలరేగింది. పీటర్‌నీ, అతని కూతుర్ని బెదిరించి భార్గవరాముడు తన పక్షం తిప్పుకున్నా కానీ, పీటర్‌ని మళ్ళీ ప్రాసిక్యూషన్ తరపు సాక్షిగా మళ్ళించడంలో అతనికి ఎంతో సంతృప్తిగా, గర్వంగా మెడలకి ఉచ్చులు బిగిసే వరకూ పీటర్‌ని భయపెట్టి ఉంచడం చాలా అవసరమని అతను భావించాడు. ఎప్పుడైనా సరే, తన బెదిరింపు, భార్గవరాముడి బెదిరింపుకంటే ఒక మెట్టుపైనే ఉండాలని అతని మెదడు పక్కననే ఉన్న చెవితో గుసగుస లాడింది.

ఒకరోజు రాత్రి బాగా తాగిన తరువాత, ఈ విషయంపై ఒక కొత్త ఆలోచన అతని వేడెక్కిన మస్తిష్కంలోకి దూసుకువచ్చింది. తాను అవలంబించగలిగిన దౌర్జన్య పద్ధతులలో ఒక చిన్న అస్త్రాన్ని మీదకి వదలాలి.

అతను పీటర్ కూతుర్ని తన ఇంటికి రప్పించి, చాలా క్రూరంగా అఘాయిత్యం చేశాడు. తన సర్వస్వమూ కోల్పోయిన ఆ లేడిపిల్ల ఒక పిచ్చిదానిలాగా ఏడుస్తూ పరుగెత్తి వెళ్ళి రైలు కింద తలపెట్టి తన దుర్భర జీవితాన్ని సమాప్తి చేసుకుంది. వెర్రెత్తిన పీటర్ పోలీస్‌స్టేషన్‌కి పరుగులు తీసినా, తాండవకృష్ణకి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసినా, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఊరుకున్నారు. పత్రికలవాళ్ళు కొంతమంది, పీటర్ దగ్గరికి వెళ్ళి సానుభూతి తెలిపారు. భార్గవరాముడిని, అతని అనుచరులకు వ్యతిరేకంగా, తనిచ్చిన సాక్ష్యం నిజం కాదని, తాండవకృష్ణ బెదిరింపులకి భయపడి, తను అలా చెప్పానని, తనను మరింత భయపెట్టించడానికి చిరుపుష్పంలాంటి తన కూతురి బతుకు చింకి విస్తరిలా అతను చేశాడని పీటర్ వాళ్ళతో చెప్పివాపోయాడు. మరుసటి రోజు ఉదయం అన్నీ వార్తా పత్రికలలో ఈ వార్త పెద్దపెద్ద అక్షరాలలో వచ్చింది. కానీ, తాండవకృష్ణకు వ్యతిరేకంగా పోలీసులు ఏ విధమైన చర్యతీసుకోలేదు.

ఈ వార్త చదినిన హరికి, అనూరాధకి, పట్టలేని దుఃఖంతో పాటు తాండవకృష్ణ మీద కోపం, ద్వేషం కూడా కలిగాయి.

మురళి హత్యకేసు తాండవకృష్ణ ఇష్టప్రకారంగానే ముందుకు సాగింది. కారణం సుస్పష్టమే కదా. సీతాపతిరావు శవదహనమైతేనే, ముఖ్యమంత్రికి, హోంమినిష్టర్‌కి సరియైన మనశ్శాంతి లభిస్తుంది. సీతాపతిరావు కూతురి మృతివల్ల, కొడుకు పోలీసుకేసులో ఇరుక్కోవటం వల్ల, అతను క్షీణదశకి చేరుకోవడం వారికి సంతోషదాయకమే. సీతాపతిరావు బతికి ఉన్నంత కాలం తమకు భద్రత లేదని వాళ్ళ భయం. తన చితాభస్మం నుంచి కూడా తిరిగి లేవగల ప్రతిభాశాలి అతను అని వాళ్ళ అభిప్రాయం. లేచి నిలబడటానికి కూడా శక్తి లేని విధంగా అతన్ని మానసికంగా, శారీరకంగా దెబ్బతీయాలనేదే వారి అభీష్టం. కూతురూ పోయి, కొడుకు కూడా ఉరికంబానికి ఎక్కాక, ఏ తండ్రికైనా సమచిత్తత తిరిగి వస్తుందా? తిరిగి అతను అధికారం కోసం అర్రులు చాస్తాడా? హృదయం పగిలి అతను చనిపోకపోతే అతనిలో ఏ మూలో ఉన్న జీవితేచ్ఛ అడుగంటిపోకుండా ఉంటుందా? సంతాన నష్టానంతరం యుద్ధభూమికి తిరిగిరావడానికి అతను రావణబ్రహ్మ కాడే?

పీటర్ వైఖరిలో వచ్చిన మార్పు గురించి, అన్నిదిన పత్రికలలో వార్తలు వచ్చాకా, భార్గవరాముడు అతని మిత్రులపై పెట్టిన హత్యకేసు ఆధారరహితమని, నిజానికి అది ఒక ఆత్మహత్య కేసని, అందుకే ఆ కేసు పడగొట్టాలని చేసిన వాదన హైకోర్టులో అంగీకరించబడినది. భార్గవరాముడి కుటుంబానికి తాత్కాలికంగా కొంత ఊరట కలిగింది కానీ, అది ఎంతోకాలం నిలవలేదు. ప్రభుత్వం ఆ తీర్పుకి వ్యతిరేకంగా డివిజన్ బెంచికి అపీలు చేయడం జరిగింది. న్యాయరహితమైన కొన్ని ఒత్తిళ్ళ ప్రభావంగా, సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కొట్టివేయబడింది. కేసు ఛార్జ్ చేసేటప్పుడు, భార్గవరాముడికి, అతని మిత్రులకి ఇచ్చిన బెయిల్ కాన్సిల్ చేయాలని కూడా డివిజన్ బెంచి నిర్దేశించింది. ఎక్కువ ఆలస్యం చేయకుండా,

కోర్టులో కేసు దాఖలు చేయడమైంది. భార్గవరాముడు, అతని మిత్రులు కటకటాల రుద్రులయ్యారు.

ప్రతివాది పక్షం తరఫు వాదించడానికొచ్చిన వకీలు హరికుమార్, మొదట్లో ఒప్పుకోలేదు కానీ, అనూరాధ ప్రోద్బలం వల్ల అతను దీనికి సిద్ధమయ్యాడు. ఇందులేఖ, మురళిల ఆత్మహత్యలకి బాధ్యుడు తన తండ్రి అనే ఆలోచనవల్ల మాత్రమే కాదు ఆమెలో అతనిపై కోపావేశాన్ని రగిల్చింది. ఆ దుర్మరణాలకి కారకుడైన అతన్ని ఆమె క్షమించి ఉండేదేమో. కానీ, తనకన్నా చిన్నదైన ఒక అమ్మాయిని పైశాచికంగా బలాత్కారం చేసి ఆమె మరణానికి కారకుడైన తండ్రిని మాత్రం ఆమె మన్నించలేకపోయింది. అతణ్ణి ఒక రాక్షసుడుగా భావించసాగింది. అందుకే తాండవకృష్ణకి వ్యతిరేకంగా ఏ చర్య తీసుకున్నా అది ఒక పుణ్యకార్యమే అవుతుందన్న భావన ఆమెలో వేళ్ళూనింది. అనూరాధ అనురోధానికి విరోధంగా అనురాగబద్ధుడైన హరికుమార్ ఏదైనా చేయగలడా?

భార్గవరాముడు హరికుమార్‌కి జరిగిన విషయమంతా యథాతథంగా వివరించాడు. విషయంమంతా విన్నాక, సత్యసంధుడైన ఆ అడ్వకేటుకు అపరాధి పక్షం వహిస్తానని అంగీకరించక తప్పలేదు. భార్గవరాముడు చేసినదాంట్లో తప్పేమీ లేదని అతనికి అనిపించింది. తన చెల్లెలి మెడలో పుస్తెలతాడు బదులుగా ఉరితాడు పడటం చూసి, అలాంటి తాడుతోనే మురళి మెడకి బిగించిన భార్గవ రాముణ్ణి ఆ వకీలు మనసారా శ్లాఘించాడు. జీవితంలో కలుసుకోలేని ఆ ప్రేమికుల ఆత్మలు ఆ రాత్రివేళలో సంలీనం అయి ఉంటాయని భార్గవరాముడితో పాటు ఆ వకీలుకి కూడా నమ్మాలనిపించింది. మురళి ఎంత దుర్మార్గుడైనప్పటికీ పాపపంకిలమైన అతని శరీరం నుంచి విముక్తమైన ఆత్మ పరిశుద్ధ మయ్యుండవచ్చుఅని హరికుమార్ అనుకున్నాడు. ఈ కేసులో ముద్దాయికి అనుకూలంగా తీర్పు వచ్చేటట్టు చేయడం ఎంతో అవలీలగా సాధించగలనని అతని నమ్మకం, భార్గవరాముడు ఆ హత్యాకాండని ఎంతో సమర్థంగా నిర్వహించాడు

కదా. ఇతనే తాండవకృష్ణకి కొడుకై పుట్టి, 'లా' కూడా చదివి ఉంటే తాండవకృష్ణని తలదన్నే క్రిమినల్ లాయరై ఉండేవాడేమో. పోలీసువాడైన మామయ్యో, తాతయ్యో, మంత్రి కుమారుడైన అతని మెదడులో దాగిఉంటాడని లాయరు భావించాడు.

హరి ఆ కేసు తీసుకోవడం అతని తల్లితండ్రులకి ఇష్టం లేదు. కొడుకు హత్య జరిగిన తరువాత, తాండవకృష్ణ ప్రతీకారాగ్ని నానాదిశలకు వ్యాపించిఉంటుందని వాళ్ళు భయపడ్డారు. కూతురు ఇల్లువదిలి వెళ్ళిపోవడం, కొడుకు ఇంటిలోనే హత్యకావించబడ్డ తరువాత, నిర్దయుడైన ఆ వ్యక్తి, గాయపడిన పులిలాగా రూపాంతరం చెందిఉంటాడని వారు అనుకున్నారు. అతని అతిపెద్ద శత్రువైన సీతాపతి పక్షం గానీ, హంతకుడైన అతని కొడుకు పక్షం గానీ, ఎవరైనా వహిస్తే వారు తనమీద యుద్ధాన్ని ప్రకటిస్తున్నారని తాండవకృష్ణఅనుకుంటాడని నాగభూషణం దంపతులు భావించారు. మురళి ఖూనీ కేసులో, ప్రతివాది వకీలుని చంపడానికి కూడా తాండవకృష్ణ సంకోచించడని ఆ తల్లితండ్రులు భయ విహ్వలులయ్యారు. ఆ కారణంగా, ఆ కేసు తీసుకోవద్దని హరితో వారు గట్టిగా వాదించారు. కానీ, చివరికి అనూరాధ అభిప్రాయానికి తలవగ్గకుండా ఉండటం వారికి సాధ్యం కాలేదు. ఎన్నెన్నో కారణాలు చెప్పి అత్తామామలను సమాధానపరచగలిగింది ఆ కోడలు వకీలు.

మొదటిసారి ఆ కేసు విషయంలో కోర్టుకి వెళ్ళే రోజు ఉదయం, గుడికి వెళ్ళి దేవుడి అనుగ్రహం కోరమని హరినీ, అనూరాధని, తల్లి ఆదేశించింది. కోర్టుకి బయలు దేరే సమయంలో హరికి, మంచి శకునం చూసుకుని వెళ్ళమని తండ్రి చెప్పాడు. హరికి అలాంటి విషయాలలో నమ్మకం లేదు. బయలుదేరే సమయంలో ఏకద్విజుడు ఎదురొస్తే అది దుశ్శకునమట. ఒక ద్విజుడికి మాత్రం ఎందుకి డిస్‌క్వాలిఫికేషన్? ఎందుకంటే ఈ ప్రపంచంలో ఒక్క ద్విజుడికి మాత్రమే కదా రెండు జన్మలు. పిల్లులకి తొమ్మిది జన్మలున్నాయట.

అందుకని ద్విజుడంటే ఇంచుమించు పావుపిల్లి అన్నమాటే కదా! ద్విజద్వయం వస్తే మంచి శకునమని అంటారు. కానీ, ఆ వచ్చే వాళ్ళిద్దరూ బ్రాహ్మణులు అవునా కాదా అని ఎలా తెలుసుకుంటాం? ఎదురు వచ్చేది ఒక స్త్రీ అయితే అది మంచి శకునం కావచ్చు. దుశ్శకునం కావచ్చు. అది ఎలా? ఎదురువచ్చే స్త్రీ ఒక పుణ్యస్త్రీ అయితే అది మంచి శకునమవుతుంది ...... పుణ్యస్త్రీ కన్నా మించిన మంచి శకునం. కానీ, ఎదురుగా వచ్చే ఒక స్త్రీని ఆపి ఆమె శీలం గురించి ప్రశ్నించడం చాలా ప్రమాదకరం. బయలు దేరేటప్పుడు దారికి అడ్డంగా ఒక గండుపిల్లి పరుగెత్తి వెళ్తే అది దుశ్శకునమట. అలా జరిగితే, కాస్సేపు మీ ప్రయాణాన్ని వెనక్కివేయాలని శాస్త్రం. అయితే ఆ వెళ్ళింది గండుపిల్లి అవునా కాదా అని ఎలా తెలుస్తుంది? రంగు రంగుల సల్వార్ కమీజుగానీ, ఫ్రాక్ గానీ, మిడ్డీగానీ ధరించిన ఒక ఫ్యాషన్‌బుల్ అమ్మాయి ఒక స్కూటర్‌మీద వెళ్తుంటే ఆ అమ్మాయిని చూడాలా లేక ఆ స్కూటర్ రిజిస్ట్రేషన్ నెంబర్‌ని గమనించాలా? ఆ నంబర్‌ప్లేటుని చూడటం కష్టం కాదు కాకి, గండుపిల్లి గుప్తంగా ఉంచే దాని వ్యక్తిత్వాన్ని వెతికి విశ్లేషించి అది దుశ్శకునమని తీర్పు చెప్పడం ఎంతో దుష్కరం.

సెషన్సు కోర్టులో ఆ కేసు విచారణ కొంచెం తీవ్రంగానే మొదలయ్యింది. ప్రతిరోజూ ఆ కేసు విషయాలపై వార్తా పత్రికలలో చిలవలు పలవులు చేర్చి రిపోర్టుచేయడం వల్ల, ప్రజలకు శాసనసభా కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారం చేసిన దాని కంటే ఎక్కువ వినోదం కలిగింది.

తాండవకృష్ణకి ప్రాసిక్యూషన్ న్యాయవాదిని కేసు గురించి ఎక్కువ మోతాదులో నిర్దేశించడం, దైనందిన కార్యక్రమమయింది. అది కోర్టుహాలుకే పరిమితం కాకుండా, కోర్టు బయట, ప్రాసిక్యూషన్ వకీలు ఇంటివద్ద దాదాపు ఒక దబాయింపు రూపంలో కొనసాగుతూ వచ్చింది. పరీక్షా పత్రాలని, ముందుగానే లక్షలిచ్చి సంపాదించిన ఒక ట్యూటోరియల్ కాలేజి యజమాని, తన విద్యార్థులను

తయారు చేస్తునట్లు, ఎంతో ఆత్మవిశ్వాసంతో తాండవకృష్ణ ప్రాసిక్యూషన్ వకీలుకి, పాయింట్ బై పాయింటు నిర్దేశాలు, నిస్సంశయంగా, నిశ్చితంగా, ఖచ్చితంగా, సుస్పష్టంగా, చెప్పడం జరిగింది. కేసు విచారణ ముందుకు సాగుతూ ఉండగా, దొరికిన ప్రశ్నాపత్రంలో అన్ని ప్రశ్నలు సరైననవేనా లేదా వాటిలో కొన్ని మిడతం బొట్లు ప్రశ్నలేవయినా ఉన్నాయేమోనని ట్యుటోరియల్ కాలేజీ వాళ్లకు సందేహం కలిగినట్లు, తాండవకృష్ణకు 'బ్రాండ్ న్యూ' భయాలు పుట్టుకువచ్చాయి. ఒకసారి, కొన్ని ప్రాసిక్యూషన్ వాదాంశాలను, హరికుమార్ అప్పడాల దొంతి గుండపిండి చేసినట్టు చేసేటప్పుడు, పరీక్షా పత్రాల లీకేజీవల్ల ఆ పరీక్షలే వాయిదావేస్తే ట్యుటోరియల్ యజమానికి కలిగే నిరాశా, నిస్పృహ, నిస్త్రాణ తాండవకృష్ణకి కలిగేది.

ఒక పిచ్చివాడిలాగా, తాండవకృష్ణ అప్పుడప్పుడూ తనలో తనే ఏవేవో అర్థం పర్థం లేకుండా మాట్లాడుకుంటూ ఉండేవాడు. అసలే అరుదైన నిద్ర అతని పిచ్చికి భయపడినట్టు ఇంకా దూరంగా ఉడాయించింది. తాగుడు మైకంలో కళ్ళు మూసుకుపోవడాన్ని నిద్ర అంటారా? అది ఒక అబోధావస్థ మాత్రమే ..... అతని మెదడుని, కాలేయాన్ని, వృక్కలను చీల్చి చెండాడుతున్న అబోధనావస్థ. ఈ ప్రపంచం నుంచి పలాయనం చిత్తగిస్తున్న సగం చచ్చిన సందర్భాలలో అతని దుష్టాత్మ పాతాళ సందర్శనం చేస్తుంటుందేమో.

అలాంటి సందర్శనాల ప్రభావం వల్ల కావచ్చు. తాండవ కృష్ణ మనసులో అల్లుణ్ణి హత్య చేయించాలనే ఆలోచన పుట్టుకొచ్చింది. దాని గురించి ఒక రౌడీ ముఠాకి నిర్దేశాలిస్తూ అవసరమయితే హరితో ఎల్లప్పుడూ ఉండే అనూరాధ కూడా లేపెయ్యడానికి వెనుకాడవద్దని, ఆ క్రూర హృదయుడు చెప్పడం జరిగింది.

ఒక రోజు ఉదయం హరి, అనూరాధలు కోర్టుకి వెళుతున్నారు.

కొద్దిరోజుల నుంచి ఆ కారును ఒక డ్రైవరు నడుపుతున్నాడు. కారు వెనక సీట్లో కూర్చుంటున్న ఆ అభిభాషక దంపతులకు ఏవేవో చదవడం, చర్చించడం అవసరమవుతూ ఉంటుంది. హైదరాబాదులో కారు నడిపే డ్రైవరు పరిస్థితి ఎలా ఉంటుందంటే...సర్కసులో కళ్ళకు గంతలు కట్టుకుని కత్తులు, విసిరే పరిధిలో నిలబడి తనకు కాబోయే వధువు వివాహాత్పూర్వమే వితంతువు కాకూడదని ఊపిరి బిగపడుతూ, చెమటలు పోసుకుంటూ, దైవాన్ని ప్రార్థించే ఒక సర్కసు కుర్రవాడి ఆందోళనలా ఉంటుంది.

ఒక ట్రాఫిక్ లైటు దగ్గర హరి కారు ఆగింది. ఆ కారు డ్రైవరుకి డోరు తెరవ డానికి వీల్లేనంత దగ్గరగా ఒక అంబాసిడర్ కారు రాసుకుంటూ వచ్చి నిలబడడం నచ్చలేదు. ఇదేమీ గమనించకుండా హరి ఒక కేసు ఫైలు పరిశీలించడంలో నిమగ్నమయిపోయాడు. ఆ అంబాసిడర్ కారులో డ్రైవరు కాకుండా, ముగ్గురు యువకులు ఉన్నారు. పచ్చలైటు వెలగడంతోటే కార్లన్నీ హడావిడిగా ముందుకు కదలడం ప్రారంభమవడంతో ఆ సంఘటన జరిగింది. అంబాసిడర్ కారు ముందుసీట్లో కూర్చున్న పిల్లిగడ్డం మనిషిహరి కారువైపుకి రివాల్వర్‌ని గురిపెట్టాడు. అది గమనించినన హరి కారుడ్రైవరు సడన్ బ్రేకు వేయడంతో, వెనక ఉన్న కారు ఢీకొట్టడం రెండు మూడు రౌండ్ల తూటాలు పేలిన చప్పుళ్ళు వినిపించడం అంతా ఒకేసారి జరిగిపోయింది. ఆ అంబాసిడర్ కారు అతివేగంగా ఆ వాహనారణ్యంలో అదృశ్యమయ్యింది.

కారులో హరికి కుడిపక్క కూర్చున్న అనూరాధ ఆ పిల్లిగడ్డం మనిషి గురిపెట్టిన రివాల్వర్‌ని రెప్పలార్చకుండా చూస్తూ, రివాల్వర్‌కీ, హరికి మధ్య అడ్డంగా వాలింది. పేల్చిన మూడు తూటాల్లో ఒక్క తూటా మాత్రం దూసుకెళ్ళి అనూరాధ గుండెల్లో నాటుకుంది. ఏం ఆ ఒక్క గుండూ చాలదా? అమె చీరా, జాకెట్టు వెచ్చటిరక్తంతో తడిసిపోయాయి. కానీ, ఆ విషయం ఆమెకి తెలిసినట్లు లేదు. ఎందుకంటే అదేక్షణంలో ఆమె అచేతనావస్థలోకి జారిపోయింది. ఏ

మాత్రం ఆలస్యం చేయకుండా ఆమెని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. హరికి తన జీవితమే అస్తమించిపోయిందన్న భావం కలిగింది. కొద్ది సేపటి తర్వాత, అనూరాధకి ఆపరేషన్ చేసిన డాక్టరు చెప్పిన ఆశ్చర్యకరమైన విషయం, హరి నమ్మలేకపోయాడు. గుండెలేని ఆ తుపాకీ గుండుకు ఆమె కోమల శరీరాన్ని చీల్చుకొని ఆమె గుండెదాకా ప్రయాణించటం ఇష్టం లేకపోయింది కాబోలు. ఆ చవకబారు లోహపు ముక్క, తాళిబొట్టుకి ఒక పక్కన తాకి, తనతోబాటు, ఆ సూత్రాన్ని కూడా ఆ సుకుమార శరీరంలోనికి ప్రవేశించడానికి ప్రేరేపించిందట. తత్ఫలితంగా ఆమె శరీరంలో ఎక్కువలోతున గాయం కాలేదు. కనీసం ఈ విధంగానైనా నాలుగురోజులు పూర్తి విశ్రాంతి తీసుకునే అవకాశం ఆమెకు లభించింది. పాపం, హరి కూడా తన అత్యవసరమైనటువంటి పనులన్నీ వాయిదావేసి, ఆమె దగ్గరే ఆ నాలుగురోజులు గడిపాడు.

తన కోసం ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడిన భార్యని దేవతలా పూజించాలని హరికి అనిపించింది. అదే సమయంలో తన మంగళసూత్రం ....... హరి తన మెడలో కట్టిన ఆ మంగళసూత్రమే ఒక రక్షాకవచంలా తనని మరణవక్త్రం నుంచి రక్షించిందని అనూరాధ ఆత్మార్థంగా విశ్వసించింది.

దీనికంటే ఆశ్చర్యకరమైన విషయం మరొకటి జరిగింది. హరి కారుపైన దాడి జరిపిన తర్వాత ఆ అంబాసిడర్ కారు అక్కడి నుంచి అదృశ్యమయ్యేలోగా కొంత మంది దానిని గమనించడం జరిగింది. వారిలో ఒకడు, పోలీసు కంట్రోల్‌రూముకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయడం తన కర్తవ్యమని భావించడం వల్ల ఒక గంటలోపల ఆ కారును పట్టుకోవడం, పోలీసు వాళ్ళకు సాధ్యమైంది. నిజానికి ఆ కారుకి దొంగనంబరు ప్లేటు తగిలించి ఉంది. ఆ నంబరుప్లేటు మార్చేలోగా పోలీసులు ఆ కారును పట్టేసుకున్నారు. ఆ కారులో ఉన్న గూండాలకు కూడా తప్పించుకునేపి అవకాశం దొరకలేదు. వారిలో ఏ ఒక్కడూ, తమని ఆ పనికి ఎవరు నియోగించారో చెప్పలేదు. ఎంత వేధించినా

కూడా, నలుగురూ ఒకే మాటని చిలకపలుకుల్లా వల్లించారు. తాము రౌడీయిజాన్ని వృత్తిగా స్వీకరించిన వాళ్ళమనీ, రాత్రింబవళ్ళు తాగేవాళ్ళమనీ అసహజమైన ధైర్యసాహసాలకు అలవాటు పడ్డవాళ్ళమనీ, డబ్బుకోసం ఏ వ్యక్తికి కానీ, రాజకీయపక్షానికి కానీ, ఏ పనైనా చేసిపెట్టడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళమనీ వారు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో చేయాల్సిన ఎన్నో కార్యక్రమాల్లో ఒక అంశానికి ఇది రిహార్సల్ మాత్రమేనని ఆ కారు ఎవరిదో అందులో ఉన్నవాళ్ళు ఎవరో తెలియకుండా తమాషాకి ఆపని చేసామని నిజానికి ఆ కారులో ఉన్నవాళ్ళని చంపాలనే ఉద్దేశం ఉంటే మాత్రం, ఆ దాడి గురించి సాక్ష్యం చెప్పడానికి ఎవరూ మిగిలి ఉండేవారు కారనీ, వాళ్ళు నలుగురూ బృందగానం ఆలపించారు.

తన తరఫున కోర్టులో వాదించడానికి సిద్ధపడిన హరికి, రక్షణ ఏర్పాటు చేస్తానని భార్గవరాముడు చెపితే, ఆ ప్రతిపాదనని హరి ఇంతకుమునుపు తిరస్కరించాడు. కానీ, ఈ దాడి జరిగిన తరువాత, హరికి మాటమాత్రమయినా చెప్పకుండానే, భార్గవ రాముడి అనుచరులు రెండుకార్లల్లో హరి కారుని అనుసరించడం మొదలుపెట్టారు.

హరిని చంపడానికి కానీ చంపించడానికి కానీ తాండవ కృష్ణకి తప్ప మరెవరికీ అటువంటి దురుద్దేశం ఉండదనే విషయం అందరికీ తెలుసు. కానీ, అన్ని విషయాలు అవగాహన చేసుకోవాల్సిన సిటీపోలీసులకు మాత్రం, ఆ లాయరును అనుమానించడానికి కావాల్సిన సామర్థ్యం కానీ, ధైర్యం కానీ, తగిన కారణం కానీ కొరవడ్డాయి. తాండవకృష్ణకి పోలీసులు గురించి ఎటువంటి భయముండేది కాదు. ముఖ్యమంత్రి, హోంమంత్రి అతని జేబులో ఉన్నంతకాలం, అధికారభ్రష్టుడైన మాజీమంత్రి సీతాపతిరావు అతనికి శత్రువుగా ఉన్నంత కాలం, అతను ఎవరికీ భయపడవలసిన అవసరం లేదు కదా! దాడిచేసినవాళ్ళలో ఎవడైనా ఆ వకీలు పేరు బయటపెడితే, వాడిని మరింత హింసించడం తప్ప పోలీసు రికార్డుల్లో మాత్రం, తాండవకృష్ణ పేరు, కనీసం తాండ అని అయినా

ఎక్కదు. సత్యమేవ జయతే చట్టం ముందు అందరూ సమానులే.

భార్గవరాముడు, అతని అనుచరులకీ వ్యతిరేకంగా తీర్పు వెలువడటం అసంభవమని తాండవకృష్ణకి బాగా తెలుసు. ప్రాసిక్యూషన్ సాక్ష్యం చాలా బలహీనంగా ఉంది. ప్రతివాది వకీలయిన హరి, గ్రీష్మకాలపు సూర్యబింబంలా, కోర్టులో అందరి కళ్ళూ మిఱుమిట్లు గొల్పుతూ వచ్చాడు. ప్రాసిక్యూషన్ వారి వాదాలు, డిఫెన్సు వారి ప్రతివాదాలు, కోర్టుహాలులో నవ్వుల పటాకీల పేల్చినట్టుగా నడిచాయి. పాపం ప్రాసిక్యూటరు...... ప్రభుత్వ వకీలు అయినంత మాత్రాన ఈ కేసులో ఒక మయసభ సృష్టించగలడా?

ఏదేమయినప్పటికీ, ఈ కేసుపట్ల, ముఖ్యమంత్రి హెూంమంత్రి అత్యధికాసక్తి చూపించడం వల్ల, భార్గవరాముడు 'అండ్ కో' కి కఠిన శిక్ష విధించకపోతే తన మనుగడ ఏమవుతుందో అన్న భయం జడ్జీగారికి లేకపోతుందా అనే ఆలోచన తాండవకృష్ణకి ధైర్యాన్నిచ్చింది. నీతి న్యాయంపట్ల అతనికి విశ్వాసం లేనప్పటికీ, అన్యాయ మార్గాల పట్ల మాత్రం వల్లమాలిన నమ్మకం ఉండేది. తన సొంతవిషయాలలో ఆశాదృక్పథం కలిగిఉన్న ఆ స్వార్థతత్పరుడికి కావలసిన ఒకే ఒక శుభకార్యం ఏమిటంటే, అది భార్గవ రాముణ్ణి ఉరికంబం ఎక్కించడమే కదా!.

తీర్పు వెలువడే రోజు సమీపిస్తున్న కొద్దీ, తాండవకృష్ణవైఖరి, మాటల తీరు, ప్రవర్తనారీతి, చూస్తుంటే సగం పిచ్చిపట్టిన వాడిలాగా తయారయ్యాడు.

చివరికి ఆ రోజు రానే వచ్చింది. అందరూ అనుకున్నట్లు, అందరూ ఆలోచించినట్టు, అందరూ ఆశించినట్టు, బోనులో నిలబడ్డ వాళ్ళని, నిరపరాధులని నిరూపించి వారిని విడుదల చేయమని, తీర్పు వెలువడింది. కోర్టుహాలులో ఒక మూలనుంచి ఏదో వింతమృగపు ఆర్తనాదం ........ ఏమిటా ఆర్తనాదం?

వేటగాడి క్రూర బాణపు దెబ్బ తగిలి ప్రాణం రోదన రూపంలో బహిర్గమించే నాదమేనా అది? ........ లేదా తనకు ప్రాణవేదన కల్గించిన శత్రువును, తన కోరలతో గుచ్చి ఎత్తడానికి ప్రతీకారావేశంతో ముందుకు దూకుతున్న ఒక దుష్టమృగప్పుక్షుద్ర శబ్దమేనా అది? అందరూ ఆవైపుకి తిరిగి చూశారు. అక్కడ కనిపించేది తాండవకృష్ణ సంహార తాండవ నృత్యారంభమేనా? సర్వ వినాశోన్ముఖరౌద్ర నర్తన ప్రారంభ లక్షణం కాదు అక్కడ కనిపించేది. పోలీసులు వచ్చే లోపల, కొన్నిక్షణాల పాటు ప్రేక్షకులకి ఉల్లాసం కలిగించడానికా అన్నట్టు ఒక కాబరే కళాకారిణి నిర్వహించే స్ట్రిప్‌టీజ్ లాంటి దృశ్యం అక్కడ ఆవిష్కరించబడుతుంది. తాండవకృష్ణ తన నల్లకోటుని గాలిలోకి విసిరేశాడు. అది ఒక జూనియర్ అడ్వకేటు తలమీద ముసుగులా పడింది. తర్వాత, బటన్స్ విప్పకుండానే అతని తెల్ల షర్టు రెండు ముక్కలుగా చీల్చబడింది. తదనంతరం, అతని బనీను తుంటలు తుంటలుగా నానాదిశలకు వెదజల్లబడింది. అర్ధనగ్న స్థితికి చేరిన తాండవకృష్ణ మిగిలిన బట్టలని కూడా చింపేయబోతున్నాడని గ్రహించుకున్న అతని ప్లీడర్ తమ్ముళ్ళు, ఉన్న పళంగా అతన్ని ఎత్తుకొని, కోర్టు బయటనున్న కారులో కూలబడేశారు. వెంటనే, డ్రైవరు కారు పోనిచ్చాడు.

కానీ, ఆ డ్రైవరుకి తన యజమానిని ఇంటివరకూ తీసుకువెళ్ళడం సాధ్యం కాలేదు. కారు వెనుకసీటులో బిగ్గరగా నవ్వుతూ ఎగురుతున్న పిచ్చిప్లీడరు ఒక్క ఉదుటన డ్రైవరు మీదికి ఉరికాడు. ఒక చేత్తో డ్రైవరు పీక బిగపట్టి, నెత్తిమీద మొత్తడంతో ఆ కారు రోడ్డు వదిలి ఒక పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. డ్రైవరు స్పృహతప్పి స్టీరింగ్‌వీల్ మీద పడిపోయాడు. కారుడోరు తెరిచిన ఆ ఉన్మత్త తాండవుడు కొంతదూరం 400 మీటర్ల పరుగు పందెంలా పరిగెట్టాడు. తర్వాత ఆ పరుగు ఒక మారథాన్‌గా పరిణమించింది. ఆ సంఘటన తరువాత తాండవకృష్ణతో పరిచయమున్న వారికెన్నడూ అతను కనిపించలేదు.

అతనిని వెదకటానికి హరి, అనూరాధ నెలల తరబడి నిరంతర ప్రయత్నాలు

చేసినా, అవి నిష్ప్రయోజనమే అయ్యాయి. రాష్ట్ర పోలీసు యంత్రాంగం కూడా ఇదే పనిలో నిమగ్నమయినప్పటికీ, ఫలితం శూన్యం. ముఖ్యమంత్రికి, హోంమంత్రికి, అతన్ని ఎలాగైనా వెదికి పట్టుకోవాలనే పట్టుదల ఉండేది. అందుకనే, పొరుగు రాష్ట్రాల పోలీసులకు అతని ఫోటోతో పాటు వివరాలు కూడా పంపించారు. కొంత కాలంపాటు అతన్ని వెదకటానికి ముమ్మరంగా ప్రయత్నాలు జరిగినప్పటికి, కనీసం ఒక్కరైనా అతన్ని చూసినట్లు చెప్పలేక పోయారు.

ఈ లోపల ముఖ్యమంత్రి, హోంమంత్రి నిర్దేశాల ప్రకారం సెషన్స్‌జడ్జి తీర్పును సవాలు చేస్తూ, హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. సెషన్స్‌జడ్జిగారి తీర్పులో, ముఖ్యమంత్రి జోక్యాన్ని అధిక్షేపిస్తూ చేసిన ప్రతికూల ప్రస్తావనల గురించి శాసనసభ లోపలా బయట ప్రతిపక్షాలు చాలా తీవ్రంగా విమర్శించాయి. ఈ తీర్పుపై హైకోర్టుకి వెళ్ళే ప్రయత్నం సమర్థనీయం కాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిప్రాయపడినా, అప్పీలు చేయకుండా ఉండటం తమ మనుగడకే ముప్పు అని ముఖ్యమంత్రికి, హోంమంత్రికి తెలుసు. తీరా హైకోర్టు తీర్పు వచ్చేసరికి మాత్రం, ఇద్దరు మంత్రివర్యులకు, పోలీసు కమిషనర్‌కు, చెంపపెట్టయి కూర్చుంది. ప్రభుత్వానికి రాబోయే గండం గట్టెక్కించడానికి కమిషనర్‌ని, డిప్యూటీ కమిషనర్‌ని, ఇన్‌స్పెక్టర్‌ని బలిపశువులుగా చేసి సస్పెన్షన్‌లో పెట్టినా, చివరికి ముఖ్యమంత్రి గారికి మోకరిల్లక తప్పలేదు.

• • •

మంత్రిమండలి సలహా ప్రకారం, గవర్నర్ గారు శాసనసభను రద్దు చేశారు. ఎన్నికలు జరిగాయి. అధికార పార్టీకే తిరిగి విజయం వరించింది. కానీ, ఈ సారి శాసనసభా నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డది వేరెవరో కాదు సీతాపతి రావే.

పోలీసుల చేత, జైలు అధికారుల చేత వేధించబడ్డ భార్గవరాముడు, ఆ పార్టీ యువతకు నాయకుడిగా, ఎన్నికల్లో కీలకపాత్ర వహించడం వల్ల, ఆ నూతన మంత్రిమండలిలో అతను హోంమినిస్టర్ కావడం సమంజసమే కదా!

• • •